

## కొలువులోనూ కీలకం




కెరీర్‌తోనూ నిర్ణయ కళకు ముడిపెట్టారు మానసిక వేత్తలు. ఉద్యోగంలో, పనిలో నిర్ణయాధికారం ఉన్న సిబ్బంది.. ఆ అవకాశంలేని వారితో పోలిస్తే చాలా ఆరోగ్యంగా ఉన్నారట. మనిషి స్వతహాగా నిర్ణయ జీవి. ఏ పని చేయాలో, ఎంత సేపు చేయాలో, ఎలా చేయాలో, ఎంత బాగా చేయాలో.. నిర్ణయించుకునే స్వేచ్ఛ ఉన్నప్పుడే ప్రేమగా చేస్తాం. శ్రద్ధ పెడతాం. సృజన జోడిస్తాం. అదనపు సమయం కేటాయించడానికి కూడా ఇష్టపడతాం. ఏ మాత్రం నిర్ణయ శక్తి లేనప్పుడు ఆ పని యాంత్రికంగా మారుతుంది. విసుగుపుట్టిస్తుంది. భారం పెరిగినప్పుడు ఒత్తిడికి గురవుతాం. ఆ ఒత్తిడి గుండెపై ప్రభావం చూపుతుంది. మనసును గాయ పరుస్తుంది. ఫలితంగా శారీరక, మానసిక రోగాలు చుట్టుముడతాయి. కాబట్టి కెరీర్‌ను ఎంచుకుంటున్నప్పుడు నిర్ణయాత్మక శక్తి ఉన్నవాటినే ఎంచుకోవాలి, కొంత జీతం తగ్గినా సరే. అంతేకాదు సిబ్బంది అనుభవంతో, నైపుణ్యంతో, నిర్ణయ సామర్థ్యంతో నిమిత్తం లేని పనుల్ని ఏ రోబో అయినా చేయగలదు. అలాంటి కొలువులు ఎక్కువకాలం నిలబడవు కూడా. పిల్లల ఆటబొమ్మలకూ ఈ పోలిక వర్తిస్తుంది. కన్నవారు చేతికిచ్చిన బొమ్మతో ఆడుకున్న పిల్లలతో పోలిస్తే.. తమకు నచ్చిన బొమ్మను ఎంచుకుని ఆడుకునే పిల్లలే ఎక్కువ ఆనందాన్ని ఆస్వాదించినట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. తల్లిదండ్రుల ప్రభావానికి అతీతంగా తమ చదువుల్ని ఎంచుకున్న విద్యార్థులు, మిగిలినవారితో పోలిస్తే అత్యుత్తమ స్థానాల్లో ఉన్నట్టు కూడా ఓ సర్వే వెల్లడిస్తున్నది.

### అనేక రకాలుగా..

మంచి నిర్ణయాలు జీవితాన్ని, లోకాన్ని ఎలా మార్చేస్తాయో... తప్పుడు నిర్ణయాలు అంతే ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. కొన్ని ఉదాహరణలను విశ్లేషిస్తే ఓ నిర్ణయం ఎంత విలువైందో, దాని పర్యవ సానాలు ఎంత దారుణమో అర్థమవుతుంది.

**వ్యాపారం**

ఇప్పుడంటే సెల్‌ఫోన్‌తో పాటుగా కెమెరా తప్పని సరి అయిపోయింది. ఫొటోలు తీసుకోవడం చిటికెలో పని. ఒకప్పుడు అదో పెద్ద తతంగం. డబ్బు, పరపతి ఉన్నవారికే సాధ్యం. అలాంటి నేపథ్యంలో ఫొటోగ్ర ఫీని ఇంటింటికీ పరిచయం చేసిన ఘనత కొడాక్‌ది. 1970లలోనే ఒక కొడాక్ ఇంజనీరు, అద్భుతమైన డిజిటల్ కెమెరాను రూపొందించాడు. దాన్ని చూసి యాజమాన్యం... ఇది కూడా ఓ కెమెరాయేనా అంటూ వెక్కిరించింది. రీలు కడిగించుకుని ఫొటోలు చేయించుకునే సౌలభ్యం లేని కెమెరా అసలు కెమెరానే కాదు అని తేల్చేసింది. లోకం మారుతున్నా, తన పాత పద్ధతులనే పట్టుకు వేలాడింది. ఫలితం! కొడాక్ కంపెనీ కనుమరుగైపోయింది.

**పర్యావరణం**

పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం అనే సామెత చైనాలో కూడా ఉండే ఉంటుంది. అదే అస్త్రాన్ని ప్రయోగిం చారు చైనీయులు. ఫలితమూ అనుభవించారు. పిచ్చు కలు పంటలను నాశనం చేస్తున్నాయనే కోపంతో.. పిచ్చుక కనిపిస్తే చంపేయమని ఆజ్ఞ ఇవ్వడమే కాకుండా, చంపినవారికి చంపినన్ని బహుమతులు కూడా ప్రకటించారు. రెండేళ్లపాటు అంతా కలిసి కోట్లాది పిచ్చుకలను చంపిపారేశారు. అయితే, పిచ్చు కల తొలి లక్ష్యం పంట కాదు, అక్కడ ఉండే కీటకాలు అని తెలుసుకునేసరికి ఆ జాతి కనిపించకుండా పోయింది. కీటకాలకు అడ్డూ అదుపూ లేకపోవడంతో పంటలు నాశనమై మహా కరువు వచ్చింది. తప్పు తెలు సుకుని పొరుగుదేశం నుంచి పిచ్చుకలను దిగుమతి చేసుకునేలోగా కరువుతో, కోట్ల మంది చనిపోయారు.

**రాజకీయం**

మొదటి ప్రపంచయుద్ధంలో జర్మనీ ఓటమి పాలైంది. ఆ అవమాన తీవ్రత జాతీయవాదానికి దారి తీసింది. దాన్ని నిర్మాణాత్మకంగా తీర్చిదిద్దిన వ్యక్తి హిట్లర్. నాజీ పార్టీ అధ్యక్షుడిగా హిట్లర్, ప్రపంచాన్ని జయించాలని మాత్రమే కలలు కనలేదు. రష్యాను ఆక్రమించి, జర్మన్ పౌరులతో నింపేయాలని అనుకు న్నాడు. 1939లో రష్యాతో జరిగిన శాంతి ఒప్పం దాన్ని ఉల్లంఘించి, లక్షలమంది సైనికులను ఉసి గొల్పాడు. రెండో ప్రపంచయుద్ధంలో భాగమైన ఈ ఆక్రమణకు ఆపరేషన్ బర్బరోసా అని పేరు. మానవ చరిత్రలోనే అతి తీవ్రమైన దురాక్రమణగా దీనికి పేరు. అంకెలను చూసుకుని మురిసిన హిట్లర్... వాస్తవ పరి స్థితులను అంచనా వేయలేకపోయాడు. మాస్కో వరకు చేరుకున్నప్పటికీ... గడ్డ కట్టించే చలిలో జర్మన్ సైనికులు మనలేకపోయారు. వాళ్ల యుద్ధ ట్యాంకులకు మంచు, బురదలో నడిచే సత్తా లేకపోవడం మరో వైఫల్యం. ఒక్కసారిగా ప్రతికూలంగా మారిన పరిస్థితు లను అంచనా వేసేందుకు వాళ్లు తీసుకున్న విరామం.. రష్యా పుంజుకునేలా చేసింది. జర్మనీ చిత్తుగా ఓడింది.

### ఇన్‌స్టంట్ నిర్ణయాలు... హ్యూరిస్టిక్

ప్రతిసారీ నిర్ణయం తీసుకోవడానికి తగినంత సమయం ఉండదు. అప్పటికప్పుడు చటుక్కున తీసేసు కోవాలి. ఇలాంటప్పుడు తగిన నిర్ణయం తీసుకునే నైపుణ్యాన్ని హ్యూరిస్టిక్ అంటారు. దీనికోసం కొన్ని మార్గాలు కూడా సూచిస్తారు.

- కాగితంలో ఓవైపు అనుకూలతలు, మరోవైపు ప్రతి కూలతలు రాసుకుని ఏవి ఎక్కువ ఉన్నాయో గమనించుకోవడం.
- సమస్య అర్థం కాకపోతే, ఒక బొమ్మ లేదా ఫ్లో చార్ట్ ద్వారా దాన్ని కాగితం మీద పెట్టడం వల్ల సృజన పెరుగుతుంది. మార్గం తోస్తుంది.
- ఫలానా నిర్ణయం ఎలా ఉంటుంది అని ముందు గానే ఆలోచించుకుని... దానినుంచి వెనక్కి జరుగుతూ విశ్లేషించడం.
- ఒక ప్రత్యేకమైన సమస్యగా కాకుండా... ఇలాంటి పరిస్థితుల్లో ఎలాంటి నిర్ణయం తీసుకుంటే బాగుం టుందో ఆలోచించి, దాన్ని అమలు చేయడం.

ఓ మంచి నిర్ణయం తీసుకోవడం గురించి అనా దిగా ఎన్నో సూక్తులు వినిపిస్తూనే ఉన్నాయి. కావ్యాల నుంచి వ్యక్తిత్వ వికాస పుస్తకాల వరకు... విలువైన సూచనలు కనిపిస్తాయి. భగవద్గీత మొదలైందే ఏ నిర్ణయం తీసుకోవాలి? అనే అర్జునుడి 'సంశయం' నుంచి కదా! ■